క్లుప్తంగా...

సరదా ఖాన్‌కు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు



చార్మినార్: ఉన్నత విద్యావంతురాలు, ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ సరదా ఖాన్‌కు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు–2025 లభించింది. చార్మినార్ నారాయణ పాఠశాలలో కొంత కాలంగా ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె సేవను గుర్తించిన సావిత్రి బాయి పూలే జయంతి ఉత్సవ కమిటీ ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డును అందజేసి సత్కరించింది. జయంతి ఉత్సవ కమిటీ, బీసీ సంక్షేమ సంఘం, తెలంగాణ రాష్ట్రం సంయుక్తంగా రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆమెకు ఈ అవార్డు దక్కింది. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై ప్రవచనాలు



చార్మినార్: తిరుపతి తిరుమల దేవస్థానం వారి ఆధ్వర్యంలో అళ్వార్ దివ్య ప్రభంద ప్రాజెక్ట్‌లో భాగంగా పూసల బస్తీలోని పద్మావతి అలవేలు మంగా గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 13వ తేదీ వరకు తిరుప్పావై ప్రవచనాలు కొనసాగనున్నాయని వేద పండితుడు శ్రీమాన్ శ్రీధరాచార్యులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుంచి ఆరాధన, తిరుప్పావై సేవా కాలం, గోధా అష్టోత్తరం నివేదన, తీర్థ ప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ నెల 10న ముక్కోటి కేకాదశి, 11న కూడారై ఉత్సవం, 13న గోధా రంగనాథుల కల్యాణంతో పాటు కల్యాణ మూర్తుల మాడవీధుల్లో ఊరేగింపు తదితర కార్యక్రమాలుంటాయన్నారు.

సమాజ సేవకే అవోపా అంకితం



అఫ్జల్‌గంజ్: సమాజ సేవకే అవోపా అంకితమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ అన్నారు. ప్రజా సంక్షేమానికి, సమాజ శ్రేయస్సుకు అవోపా ముందుంటుందన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా అర్బన్–2 అధ్యక్షుడిగా బొద్దు శ్రీధర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా గజ్జెల స్రవంతిని ప్రకటించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి ప్రజా సంక్షేమంలో నిరంతరం పాటుపడాలని సూచించారు.

'విద్యార్థులకు క్రీడలూ అవసరం'



చార్మినార్: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసంతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) హైదరాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ ఖుస్బూ గుప్తా అన్నారు. సిటీ కాలేజీ, ఎన్‌ఎస్ఎస్, ఎన్‌వైకే సంయుక్తంగా ప్రభుత్వ సిటీ కాలేజీలో రెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్ మీట్ శనివారం ముగిసింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవ దత్ శుక్లా, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి.నాగరాజు, డాక్టర్ తిరుపతి, ఫిజికల్ డైరెక్టర్ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సంగం శ్మశానవాటిక



సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ల వెలుగులో అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

చారిత్రక శ్మశానం.. వసతులు హీనం..

- లంగర్‌హౌస్ త్రివేణి సంగం శ్మశానవాటికలో సమస్యల తాండవం
- సెల్‌ఫోన్ వెలుగుల్లోనే అంత్యక్రియలు
- శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరుతున్న స్థానికులు

లంగర్‌హౌస్: చినపోయిన వారి చివరి ప్రయాణ అంత్యక్రియల యాత్ర, చివరి కార్యక్రమాలు బాధతో అయినా గొప్పగానే చేసే ఆచారాలు ఉన్నాయి.. అలాంటి చివరి కార్యక్రమాలు వసతులు లేకుండా నరకయాతన పడుతూ చేయాలంటే వారి కుటుంబీకుల్లో దుఃఖం మరింత పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితులు లంగర్‌హౌస్ త్రివేణి సంగం శ్మశానవాటికలో కనిపిస్తున్నాయి. ఇక్కడ స్థానికులే కాదు సుదూర ప్రాంతాల నుంచి వారి కుటుంబీకుల మృతదేహాలకు అంత్యక్రియల కోసం ఇక్కడికే తీసుకువస్తారు. మాజీ కార్పొరేటర్లు రవియాదవ్, ఉదయ్‌కుమార్ వారికి తోచినంతగా గతంలో చేసిన అభివృద్ధి తప్పా ఇక్కడ కనీస వసతులు లేక అంత్యక్రియల సమయంలో తల్లడిల్లుతున్నారు. ఎంతగా అంటే సెల్‌ఫోన్ వెలుగుల్లో అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం దిగివచ్చి చారిత్రాత్మక శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటికకు వేల ఏళ్ల చరిత్ర..

లంగర్‌హౌస్‌లోని శ్మశానవాటికకు కొన్ని వేల ఏళ్ల చరిత్ర ఉంది. దక్షిణ కాశీ, పేదల కాశీగా పేరు. కాశీకి వెళ్లలేని వారు, ముఖ్యమైన ఐదు ప్రాంతాల్లో అస్థికల నిమజ్జనం చేసే వారు దేశంలోని ఐదు శ్మశాన వాటికల్లో ఈ శ్మశాన వాటికను ఎంచుకుంటారు. గతంలో భర్త చనిపోతే సతీసహగమనం కూడా ఇక్కడే నిర్వహించేవారు. వికారాబాద్, కొడంగల్ అడవుల్లో పుట్టే హిమగంగా, ముచుకుంద, గుప్తగంగల మూడు నదుల కలయిక ఈ లంగర్‌హౌస్ త్రివేణి సంగం.

ప్రముఖుల అస్థికల నిమజ్జనం ఇక్కడే..

త్రివేణి సంగం శ్మశానవాటికకు శాస్త్రవేత్తలకు కూడా అంతుచిక్కని మహిమ ఉంది. ఇక్కడ చినిపోయిన వారి అస్థికలు నిమజ్జనం చేస్తే అందులో 80 శాతం అస్థికలు రాళ్లలా మారి, కొన్ని నీటిలో పైకి తేలుతాయి. ఇలా జరిగితే వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని నమ్మకం. అందుకే గాంధీజీ అస్థికలు ఇక్కడ నిమజ్జనం చేసి బాపూఘాట్ నిర్మించారు. రాణీ రుద్రమ దేవితో పాటు, అటల్‌బిహారి వాజ్‌పేయ్, ఎన్‌టీ రామారావు, మర్రి చెన్నారెడ్డి, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలతో పాటు యుద్ధంలో వీరమరణం పొందిన పలువులు ఆర్మీ అధికారుల అస్థికలను ఇక్కడే నిమజ్జనం చేశారు.

సమస్యల తాండవం..

- ఇంత చారిత్రాత్మక శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి.
- విద్యుత్ దీపాలు లేక చేకటిలోనే అంత్యక్రియలు చేస్తున్నారు.
- సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి బర్నింగ్ పాయింట్లు సరిపోవడం లేవు.
- ఆడవారు బట్టలు మార్చుకునే సౌకర్యం లేదు.
- అస్థికలు భద్రపరిచే సరైన గదుల సౌకర్యం లేదు. అస్థికలను కలపడానికి వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తుండగా, త్రివేణి సంగం మూసీలోకి అస్థికలు నిమజ్జనం చేసేందుకు ఘాట్లు, మెట్లు లాంటి ఏర్పాటు ఏమీ లేవు.
- అంత్యక్రియల్లో పాల్గొనడానికి వచ్చిన వారిలో ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంలో బాధపడే వారు నిలబడలేక నరకం అనుభవిస్తున్నారు.
- చనిపోయినవారు ఏదో రూపంలో వచ్చి తింటారని ఆకు ముట్టడం కార్యక్రమంలో ఆకులో భోజనం పెట్టడం ఆనవాయితీ.
- ఈ ఆకు ముట్టిన తర్వాతే మిగిలిన కార్యక్రమాలు చేస్తారు. అయితే ఈ ఇరవై అంగుళాల ఆకు పెట్టడానికి కూడా ఎలాంటి నిర్మాణం, వసతి కూడా లేని దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయి.

అభివృద్ధికి శ్రీకారం చుట్టాను..



కనీస సౌకర్యాలు లేక ఒక్కోసారి వర్షంలో మృతదేహాలు తడుస్తుండగా కిరోసిన్ పోస్తూ అంత్యక్రియలు నిర్వహించేవారు. సంగం శ్మశానవాటికలో నా ఆధ్వర్యంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టాను. కోటి రూపాయలతో రెండు బర్నింగ్ పాయింట్లు, వచ్చిన వారికి కూర్చోడానికి స్టేడియంలా మెట్ల నిర్మాణ వసతి నిర్మించాం. ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు ఇక్కడ చేయాల్సి ఉంది.

– రవి యాదవ్, లంగర్‌హౌస్ మాజీ కార్పొరేటర్

ఇప్పటికీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా..



బురద, ముళ్లు, రాళ్లతో శ్మశాన వాటికకు నడిచి వెళ్లలేని పరిస్థితి ఉండేది. అక్కడకు వెళ్లడానికి రోడ్డు వేయించి శ్మశాన వాటిక లోపల కూడా పూర్తిగా సీసీ నిర్మాణ పనులు చేశాం. దాతల సాయంతో మహిళలకు స్నానపు గదులు నిర్మించాం. ప్రస్తుతానికి కూడా ఇక్కడ అభివృద్ధి కోసం పోరాడుతున్నా. పలు సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు చేయిస్తున్నాం.

– ఉదయ్‌కుమార్, లంగర్‌హౌస్ మాజీ కార్పొరేటర్

కెనరా బ్యాంక్ ఉద్యోగుల అభ్యున్నతికి కృషి



సమావేశంలో ఎంఎస్ శ్రీనివాసన్, రాంప్రకాష్, బీఎస్.మధుసూదన్

అబిడ్స్: కెనరా బ్యాంక్ ఉద్యోగుల అభ్యున్నతికి కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ కృషి చేస్తుందని ఆల్ ఇండియా కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎంఎస్.శ్రీనివాసన్, ఆల్ ఇండియా కార్యదర్శి బి.రాంప్రకాష్ పేర్కొన్నారు. శనివారం కెనరా బ్యాంక్ సీఎల్‌జేఎం సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కెనరా బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఎంప్లాయిస్ యూనియన్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేవడుతున్నామన్నారు. కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర సెక్రెటరి బీఎస్.మధుసూదన్ మాట్లాడుతూ..ఉద్యోగులు, కార్మికుల కోసం తమ ఎంప్లాయిస్ యూనియన్ అహర్నిశలు పాటుపడుతుందన్నారు. ఈ సమావేశంలో మంజీర సొసైటీ సెక్రెటరి కోటిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యులు మంజుల వినయ్‌కుమార్, వికాస్, స్టేట్ కమిటీ సభ్యులు అఖిల పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న విక్రమ్‌కుమార్, కేఆర్.రాజ్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ మొక్కను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్జీఓస్ నాయకులు శ్రీనివాస్, వైదిక్ శాస్త్రి, శ్రీధర్, ముకేద్, సుదర్శన్, పరమేష్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రి నిర్మించొద్దు



ఎమ్మెల్సీ కవితతో సమావేశమైన వినోద్‌యాదవ్, శైలేష్ కురుమ, పశుపతి తదితరులు

అబిడ్స్: గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని గోషామహల్ పరిరక్షణ సమితి నాయకులు ఆవుల వినోద్ యాదవ్, కోటి శైలేష్‌కురుమ, పశుపతితో పాటు పలువురు నేతలు ఎమ్మెల్సీ కవితను కోరారు. శనివారం కవితను కలిసి గోషామహల్‌లో ఉస్మానియా ఆసుపత్రిని నిర్మిస్తే వేలాది కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం దృష్టికి ఉస్మానియా ఆసుపత్రి సమస్యను తీసుకువెళ్లి ప్రస్తుతం ఉన్న అఫ్జల్‌గంజ్‌లోనే కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కవిత సానుకూలంగా స్పందించి గోషామహల్ ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినోద్ యాదవ్, కోటి శైలేష్‌కురుమ, పశుపతి, దత్తు, వీరేందర్, కిరణ్, నరేష్, రాజేష్, నాగేష్, గణేష్, సల్మాన్, స్వప్న పాల్గొన్నారు.


ట్రాఫిక్‌లో ఇరుక్కున్న అంబులెన్స్



మల్లేపల్లి చౌరస్తాలో..

నాంపల్లి: మల్లేపల్లి చౌరస్తాలో శనివారం రాత్రి ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ ట్రాఫిక్‌లో ఓ అంబులెన్స్‌ఇరుక్కుపోయింది. ఇక్కడ ఎనిమిది చో రాస్తాలు ఉన్నాయి. అన్ని దారులు ఒకే చోట కలువడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సకాలంలో అంబులెన్స్‌లు ఆసుపత్రులకు వెళితే రోగులకు తక్షణ వైద్యం అందే అవకాశం ఉంది. లేనిపక్షంలో దారిలోనే ఊపిరి వదిలే పరిస్థితి లేకపోలేదు. కావున ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులైనా స్పందించి మల్లేపల్లి చౌరస్తాలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

గర్భిణులకు అవగాహన



గౌలిపురా: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని సూపర్ వైజర్ అనురాధ అన్నారు. అచ్చయ్యనగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో శనివారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహార విలువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీలు ఝాన్సీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

చార్మినార్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శైలజ, రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ చంప్ల నాయక్ సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాల మేరకు చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో శనివారం గ్రేస్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో సర్వే నిర్వహిస్తున్న సూపర్ వైజర్లు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వే నిర్వహణపై హౌసింగ్ విభాగం అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సర్వే నిర్వహించాలన్నారు. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే క్షుణ్ణంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు శైలజ, సురేందర్, అరుణకుమారి, రవి కుమార్, ఇందిరమ్మ ఇళ్ల సర్వే హౌసింగ్ విభాగం ఇన్‌చార్జి అధికారులు హుస్సేన భాను, మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



పూజల్లో రాజువస్తాద్, శివకుమార్

లంగర్‌హౌస్: మణికంఠుని నామ స్మరణతో ఇబ్రహీంబాగ్ మార్మోగింది. శ్రావణ్ పటేల్, ప్రశాంత్ పటేల్ అయ్యప్ప స్వాములు శనివారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. గణపతి హోమం, అయ్యప్పకు పంచామృత, పుష్పాభిషేకాలు నిర్వహించి పడి వెలిగించారు. ఈ పూజల్లో ప్రముఖ సంఘ సేవకుడు రాజు వస్తాద్, డాక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్



సంతోష్‌నగర్: ఆటోలో ప్రయాణికుడు మరిచిపోయిన బ్యాగ్‌ను పోలీస్ స్టేషన్‌లో అందించి ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నారు. ఐ.ఎస్.సదన్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... భానునగర్ ఫాతిమా మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖాజా (47) శుక్రవారం స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్ సందీప్ ఆటోలో విలువైన డాక్యుమెంట్లు, పాస్‌పోర్టులతో ప్రయాణించాడు. మహ్మద్ ఖాజా ఆటో దిగిన అనంతరం తన బ్యాగ్‌ను ఆటోనే మరిచిపోయాడు. దీంతో తన బ్యాగ్‌ను ఆటోలో మరిచిపోయినట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లాడు. దీంతో అప్పుడే ఆటో డ్రైవర్ మహ్మద్ ఖాజా బ్యాగ్‌ను ఆటోలో గుర్తించి ఐ.ఎస్.సదన్ పోలీసులకు అప్పగించేందుకు వచ్చాడు. దీంతో ఎస్సై విజయ్ కుమార్ సమక్షంలో ఆటో డ్రైవర్ సందీప్ బాధితుడు మహ్మద్ ఖాజాకు బ్యాగ్‌ను అందజేశారు.

శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విశ్రాంత ఐఏఎస్ అధికారి పార్థసారథిని సత్కరిస్తున్న నాగబాల సురేష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఔత్సాహిక రచయితలకు శిక్షణ తరగతులు ఎంతో అవసరమని తెలంగాణ రాష్ట్ర పూర్వ ఎన్నికల అధికారి పార్థసారథి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం, ఓం సాయితేజ ఆర్ట్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న సినీ, టీవీ దర్శకులు, రచయితల శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..యువ రచయిత, దర్శకులు ఈ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..100 మంది ఔత్సాహికులు ఈ శిక్షణలో పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టెలివిజన్ రచయితల సంఘం అధ్యక్షుడు నాగబాల సురేష్‌కుమార్, కెమెరామెన్ మీర్, దర్శకులు ప్రేమ్‌కుమార్, చల్లా భాను కిరణ్, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కర్రా నరేంద ర్‌రెడ్డి, కోశాధికారి చిత్తరంజన్‌దాస్, యువ దర్శకులు మానస్ దండనాయక్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెరగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఈ సంవత్సరం ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెరగాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ బి.మాధవితో సిబ్బంది, వివిధ విభాగాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. కళాశాల లైబ్రరీలో విద్యార్థులకు అందుబాటులో ఉండే పుస్తకాల సంఖ్య అడిగి తెలుసుకున్నారు. మరిన్ని పుస్తకాలు కావాల్సి వస్తే లిస్ట్ తనకు ఇవ్వాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. అదే విధంగా గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మితో కూడా డిగ్రీ కళాశాల పనితీరు, అందుబాటులో ఉన్న అధ్యాపకుల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు అజీజ్‌ఖాన్ పటాన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, కళాశాల అధ్యాపకులు తదితరులున్నారు.

నామ్‌కే వాస్తేగా వార్డు కార్యాలయం



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జియాగూడ: ప్రజలకు సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయం నామ్‌కే వాస్తేగా మారింది. ప్రతిరోజూ వార్డు అధికారితో పాటు ఇంజినీరింగ్, టౌన్‌ప్లానర్, ఎంటమాలజిస్ట్, వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్, శానిటరీ జవాన్, వార్డు యూబీడీ సూపర్‌వైజర్, వాటర్‌వర్క్స్, విద్యుత్, కంప్యూటర్ ఆపరేటర్ సిబ్బంది ఉండాలి కానీ ఎవ్వరు ఇక్కడ ఉండరు. ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు డబుల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ మంజూరు అయ్యాయని వాటికి సంబంధించిన వివరాలతో జియాగూడ వార్డు కార్యాలయానికి రావాలని ఫోన్ చేసి చెబుతున్నారు. తీరా కార్యాలయానికి వస్తే అధికారులు ఉండడం లేదు. గత వారం రోజులుగా ఇలాగే కొనసాగుతుండడంతో మహిళలు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. సంబంధిత అధికారులు వార్డు ఆఫీస్ వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



చెత్త బజార్ రోడ్డు మధ్యలో బోలాట్స్ ఏర్పాటు చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్

యాకుత్‌పురా: ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో భాగంగా శనివారం ఆయన సిబ్బందితో కలిసి చెత్తబజార్ నుంచి మదీనా, ఎంజీబీఎస్ నుంచి చాదర్‌ఘాట్ వైపు వెళ్లే ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో బోలాట్స్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులు బోలాట్స్ ఏర్పాటు చేయడంపై స్థానిక వ్యాపారులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు, చార్మినార్ ఏసీపీ లక్ష్మణ్ ఆదేశాల మేరకు నిత్యం రద్దీగా ఉండే చెత్తబజార్, దివాన్ దేవిడి, ఎంజీబీఎస్, చాదర్‌ఘాట్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా రోడ్డు మధ్యలో బోలాట్స్ ఏర్పాటు చేసి వాహనలు సాఫీగా ముందుకు సాగేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

టెక్నో స్పోర్ట్స్ షోరూమ్ ప్రారంభం

గోల్కొండ: ప్రజల అభిరుచులకు అనుగుణంగా స్పోర్ట్స్ వేర్, ఇతర ఉత్పత్తులను అందిస్తున్నామని టెక్నో స్పోర్ట్స్ మెనేజింగ్ డైరెక్టర్ ఝున్‌ఝున్‌వాలా అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలో హై స్ట్రీట్ టెక్నో స్పోర్ట్స్ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్నో స్పోర్ట్స్ సీఈవో పుస్పెన్ మైటీ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో తమది 7వ స్టోర్ అని అన్నారు. తమ కలెక్షన్‌లో వింటర్ కలెక్షన్ ఒకటని జిమ్ బ్యాగులు, పవర్ బ్యాంకులు తదదితరవి తమ స్టోర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. టెక్నో స్పోర్ట్స్ బిజినెస్ హెడ్ రోహిత్ కులకర్ణి ఉన్నారు.



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఝున్‌ఝున్‌వాలా

హుండీ ఆదాయం లెక్కింపు



గోల్కొండ: జగదాంబిక మహంకాళి అమ్మవారి హుండీ ఆదాయాన్ని ఆలయ ప్రాంగణంలో శనివారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత పర్యవేక్షణలో ఈ హుండీ లెక్కింపు జరిగింది. ఆమె మాట్లాడుతూ..మూడు నెలల నుంచి హుండీ లెక్కింపు జరగలేదన్నారు. ఈ లెక్కింపులో మొత్తం రూ.1,25,394 వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సర్వేష్, బి.సురేష్‌చారి, వృత్తిపని సంఘం అధ్యక్షుడు టి.శివశంకర్, మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి, ఆర్.నర్సింగ్‌రావు, శంకర్, నవీన్ తదితరులున్నారు.

యూ రూల్ ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ ఆవిష్కరణ



పోర్టల్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

నాంపల్లి: దేశంలోనే తొలి ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ పోర్టల్ ప్రారంభమైంది. తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు యువతీయువకులు పౌరస్ సిటిజన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో యూ రూల్ పేరుతో సిటిజెన్ సర్వీస్ పోర్టల్‌ను మొదలుపెట్టారు. శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని గోల్కొండ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ హాజరై యూ రూల్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. అదే విధంగా ఇండిపెండెంట్ జర్నలిస్ట్ తులసి చందు హాజరై లోగోను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ..సమాచారంలో కూడా అసమానతలు ఉన్నాయని, ప్రభుత్వం అందించే సమాచారం సంక్లిష్టంగా ఉండటంతో ప్రజలకు సులభమైన పద్ధతిలో ఉపయోగకరంగా లేదన్నారు. సమాచారం అందుబాటులో లేకపోవడంతోనే వెనుకబాటుతనం ఉందని స్పష్టం చేశారు. తులసి చందు మాట్లాడుతూ..ప్రభుత్వం చేయలేని పనులను యూ రూల్ చేయాల్సి వస్తోందని తెలిపారు. యూ రూల్ ఎండీ గోవర్ధన్ మాట్లాడుతూ..రైతులు, విద్యార్థులు, గొర్రెల కాపరులు పడుతున్న బాధలు చూసి ఇలాంటి బాధలు పడే వారందరికీ సహాయం అందించి వారి సమయాన్ని, డబ్బును ఆదా చేసి తక్కువ ఖర్చుతో, సులభంగా ప్రభుత్వ సేవలు అందేలా డిజిటల్ వేదికగా సమాచా రం అందించి సహకరించాలనే ఆలోచనల నుంచి పుట్టిందే యూ రూల్ అని పేర్కొన్నారు. చీఫ్ కంటెంట్ డెవలపర్ మహేష్ కొంగర, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ రాణి గుంటికాడి, కంటెంట్ రైటర్స్ కొడిదెల సురేష్, దూడపాక నరేష్, లీగల్ అడ్వైజర్ కట్కూరి శ్రీనివాస్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్ నేనావత్ మహేందర్ పాల్గొన్నారు.